# సన్మానం

పైడిపాల



''చూడండి సార్, ఇదేదో దొంగ కేసులా వుంది. ఈ శాలువా మన షాపులోదే. ఎంతో కొంతకి అమ్మడానికి తీసుకొచ్చాడీ పెద్ద మనిషి'' సేల్స్ బాయ్ ఓ పెద్దాయనను కౌంటర్ దగ్గరకు తీసుకొచ్చాడు.

ఆయనకు వార్ధక్యం మీద బడిన లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మాసిన గెడ్డం, ముతక బట్టలు, పగిలిన కళ్ళద్దాలు ఆయన దీనావస్థను వ్యక్తం చేస్తున్నాయి. కుర్రాడు ఆయన చేతిలోని శాలువాను లాక్కొని ప్రొప్రయిటరు రామానికి చూపించాడు.

''సరేలే నేను చూస్తాను. నువ్వెళ్ళి బేరాలు చూడు'' రామం సేల్స్ బోయ్‌ని పంపించేసి, ఆయనకేసి యెగాదిగా చూశాడు. ఆయన తలదించుకుని నిల్చున్నాడు.

''ఈ శాలువా మీకెలా వచ్చింది? ఎవరో మాష్టారికి సన్మానం చెయ్యాలని శ్రీనివాస సేవా సమితి వారు వారం రోజుల క్రితం దీన్ని మా దగ్గరే కొనుక్కొని వెళ్ళారు!''

''ఆ మాష్టార్ని నేనే''-ఆయన సిగ్గుతో తలెత్తలేదు.

''మరి దీనిని ఎందుకు అమ్మ జూపుతున్నారు?''

''డబ్బు అవసరం వచ్చి''

''సారీ మాష్టారూ, మేం అమ్మిన బట్టలు తిరిగి తీసుకోం!''

''పోనీ ధర తగ్గించి యివ్వండి. నాకు డబ్బు చాలా అవసరం'' ఆయన ప్రాథేయపడుతున్నాడు.

''అదేమిటి మాష్టారూ? వాళ్ళేదో డబ్బు కూడా యిచ్చి మిమ్మల్ని సత్కరించినట్టు పేపర్లో చదివాను-ఇంతలోనే...''

ఆయన నీళ్ళు నములుతున్నాడు.

''మీ పేరు పరంధామయ్యగారే కదూ?'' అవునన్నట్టు తలూపాడాయన.

పరంధామయ్యగారు చాలా కాలం ఆ వూళ్ళోనే ఎలిమెంటరీ స్కూలు టీచరుగా పనిచేశారు.

రిటైరయి ఆర్నెల్లయింది. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పెన్షను శాంక్షను కాలేదు. ప్రావిడెంట్ ఫండ్ చేతికి రాలేదు. జీతం వస్తున్నప్పుడే సంసారాన్ని గట్టెక్కించడం కష్టంగా వున్న మాష్టారికి-అది కాస్తా ఆగిపోయిన తర్వాత పరిస్థితి మరింత దుర్భరమయింది. అలాంటి దుస్థితిలో శ్రీనివాస సేవా సమితి అనే ఓ స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా తనని ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తించి సన్మానిస్తానంటే కాదనలేకపోయారు పరంధామయ్య మాష్టారు.

స్థానిక ఎమ్.ఎల్.ఏ. అధ్యక్షతన ఘనంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో-వక్తలందరూ మాష్టారిని మహానుభావుడని ప్రశంసించారు. దండలు వేయించారు; ఫోటోలు తీయించారు. దుశ్శాలువా కప్పి, అర్ధవెయ్యి నూట పదహార్లు-చంద్రుడికో నూలుపోగులా మాష్టారికి సమర్పిస్తున్నట్టు ప్రకటించి, కార్యదర్శి కవరు అందించాడు.

ఆ మాష్టారే యిప్పుడు శాలువాను అమ్ముకోడానికి వచ్చాడంటే నమ్మలేకపోయాడు క్లాత్ షాప్ యజమాని రామం.

''ఒకసారి బయటకు తీస్తే-ఆ బట్టకు విలువుండదు మాష్టారూ! మీరు కాదూకూడదంటే ఓ పాతికరూపాయిలిస్తాను మరి''

మాష్టారు అంగీకరించి, డబ్బు తీసుకొని బయట పడ్డారు-

'మాష్టర్లే యిలావుంటే యింక దేశం ఏం బాగుపడుతుంది?- ఏ మందుకో అవసరమొచ్చి వుంటుంది' రామం వ్యాఖ్య ఆయనకు వినిపించింది.

అర్ధవెయ్యి నూట పదహార్లు బాకీ కింద చెల్లిపోయిందనీ, అది రాబట్టుకోడానికే తనకా కార్యదర్శి సన్మానం ఏర్పాటు చేశాడనీ, సన్మానం అనే ప్రచార కార్యక్రమంలో తనొక సాధనం మాత్రమేననీ, ఆ పాతిక లేకపోతే-కొత్తల్లుడికి కూడా ఆ పూట అన్నం పెట్టలేననీ... పాపం మాష్టారు చెప్పుకోలేక పోయారు!

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీ కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

— ఎడిటర్

నాకు నచ్చిన కథ: ------

రచయిత/ రచయిత్రి: ------

పేజీ నంబరు: ------